


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అంచనా కొండంత.. జాబితా గోరంత



దాచేపల్లి మండలంలో నీటమునిగి ఎండిపోయిన పత్తి

భారీ వర్షాలు, వరదలు పల్నాడు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చడంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని పంట చేలు ముంపునకు గురయ్యాయి. పత్తి, వరి, కంది పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. రైతులు కోలుకోలేని విధంగా ఆర్థికంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు పరిహారం అందకుండా చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పంట 33 శాతం పాడయితేనే నష్టం జరిగినట్టుగా లెక్క కట్టారు. దీని వలన చాలా మంది రైతులకు అన్యాయం జరుగుతుందని ముంపు ఉన్న అన్ని పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నా వారి మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు.


నరసరావుపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలు, వరదల కారణంగా 28,188 వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనాలు కట్టారు. చివరకు 7,130 ఎకరాల్లో మాత్రమే పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ, ఉద్యాన శాఖలు తేల్చాయి. వరద నీటిలో మునకేసినా దాదాపు 21 వేల ఎకరాల్లో పంటలకు నష్టం లేదని వ్యవసాయ తేల్చడంపై బాధిత అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నిబంధనలు సడలించి తమకు పరిహారం అందించాలని వారు కోరుతున్నారు. అయితే 33 శాతం పంట దెబ్బ తింటేనే నష్టపరిహారం చెల్లించే విధంగా జాబితాను రూపొందించారని సమాచారం.

ప్రాథమిక అంచనాలు ఇలా..

వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 27,013 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదతర పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు 1,188 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. మొత్తం 235 గ్రామాల పరిధిలో పంటలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. పత్తి పంట 17 మండలాల్లో 123 గ్రామాల పరిధిలో 23,318 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 14 మండలాల పరిధిలోని 66 గ్రామాల్లో 2,745 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. 628 ఎకరాల్లో కంది, 250 ఎకరాల్లో మినుము, 935 ఎకరాల్లో మొక్కజొన్న, 102.5 ఎకరాల్లో జూట్ పంటకు నష్టం వాటిల్లిందని వ్యవస్థాయ శాఖ ప్రకటించింది. ఉద్యాన పంటలు 1,187 ఎకరాల్లో ఆరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. 663 ఎకరాల్లో మిరప, పసుపు 293 ఎకరాల్లో, అరటి 44 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అధికారులు ప్రకటించారు.

పంట నష్టం తుది జాబితా ఇలా..

వ్యవసాయ, ఉద్యాన శాఖల లెక్కల ప్రకారం జిల్లాలో 7,264.06 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనా కంటే 21 వేల ఎకరాల్లో పంట నష్టం తగ్గింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 21 వేల ఎకరాలు పంట నష్టం జాబితాలోకి రాలేదు. 6924.85 ఎకరాల్లో మాత్రమే పత్తి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రకటించడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ 4.80 కోట్లు మాత్రమే పంటలకు పరిహారం చెల్లించే విధంగా వ్యవసాయ శాఖ జాబితాను ప్రభుత్వానికి పంపింది. ఉద్యాన పంటలు కేవలం 132.2 ఎకరాల్లో మాత్రమే దెబ్బతిన్నట్టు సదరు శాఖ తేల్చింది. పంట నష్టం 9.47 లక్షలుగా నిర్ధారించింది. ప్రభుత్వ నిబంధనలు వేలాది మంది రైతులకు పరిహారం అందకుండా చేశాయి. 25 నుంచి 32 శాతం వరకు పంట దెబ్బతిన్నా రూపాయి కూడా పరిహారం రాదని సదరు శాఖల లెక్కలు తెలియజేస్తున్నాయి. దీని వలన పంటలు కోల్పోయిన వేలాది మంది రైతులకు పరిహారం జాబితాలో చోటు దక్కక పోవడంతో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. నిబంధనలు సడలించి నష్ట పోయిన రైతులు అందరికి పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



బాలింతలు బెడ్‌ల వద్ద సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఫ్యాన్‌లు

కాన్పుకొస్తే.. ఫ్యాన్ తెచ్చుకోండి

- ఇదీ నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి
- గాలి ఆడక బాలింతలకు ఇక్కట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి కాన్పుకు వస్తున్నారా.. ఐతే వెంట ఫ్యాన్ తెచ్చుకోండి. ఇదేంటని ఆశ్చర్యపోతున్నారా? కాన్పుల వార్డులో నెలకొన్న దుస్థితి ఇది. ఈ వార్డులో ఏసీలు పనిచేయడం లేదు. కొన్ని ఫ్యాన్‌లు పనిచేసినా చాలినంత గాలి రావడం లేదు. గాలి ఆడక బాలింతలు, పసికందులు అల్లాడుతున్నారు. కాన్పుల వార్డులను పరిశీలిస్తే ప్రతి బాలింత బెడ్ వద్ద స్టాండ్ ఫ్యాన్‌లు కనిపించాయి. వార్డులో ఏసీలు, ఫ్యాన్‌లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇవి ఆ వార్డులో అలంకారప్రాయంగా ఉన్నాయి. దీంతో బాలింతల కుటుంబ సభ్యులు కాన్పుకు వచ్చే వారు వెంట ఫ్యాన్ తెచ్చుకుంటున్నారు. ఇక్కడ దుస్థితి తెలియ వచ్చిన వారు అద్దెకు ఫ్యాన్‌లు ఏర్పాటు చేసు కుంటున్నారు. కొంతమందైతే ఫ్యాన్‌లు కొనుగోలు చేస్తున్నారు. ఆస్ప త్రి ఆవరణలోనే జిల్లా వైద్య శాఖ కార్యాలయం కూడా నిర్వహిస్తు న్నారు. అయితే కాన్పుల వార్డులో బాలింతలు ఎదుర్కొంటున్న సమస్యలను సదరు అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పరిశుభ్రత లోపించి దుర్గంధం వెదజల్లుతుండటంతో బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి కాన్పులు చేయడంలో రికార్డు సాధిస్తున్నప్పటికీ వసతులు కల్పించడంతో వెనకబడి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కాన్పుల వార్డును సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించే దిశగా స్పం దించాలని కోరుతున్నారు.



కాన్పుల వార్డులో పనిచేయని ఫ్యాన్, ఏసీ

అందరికీ రిలేట్ అవుతుంది

'బెంచ్ లైఫ్' వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు మానస శర్మ. తమిళ నటుడు వైభవ్, చరన్ పెరి, రాజేంద్ర ప్రసాద్, రితికా సింగ్, అకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలు పోషించారు. నిహారిక కొణిదెల నిర్మించారు. ఈ శుక్రవారం ఓటీటీ సంస్థ 'సోనీ లైవ్'లో విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది.



నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ "ఇది కార్పోరేట్ ఉద్యోగుల కథ అయినా.. అందరికీ రిలేట్ అవుతుంది. వినోదంతో పాటు.. మంచి భావోద్వేగాలు ఇందులో ఉంటాయి. అద్భుతమైన కంటెంట్ ఉన్న ఈ వెబ్ సిరీస్ తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. దర్శకురాలు మానస శర్మ మాట్లాడుతూ "నేను జాబ్ చేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాలు.. లైఫ్‌లో చూసిన అనేక సంఘటనలను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ప్రతీ పాత్రకూ ఓ కథ ఉంటుంది. ఇందులోని నటీనటులు పంచే వినోదం చాలా కాలం గుర్తుంటుంది" అని చెప్పారు. నటుడు చరణ్ పెరి మాట్లాడుతూ "స్నేహ మాధుర్యాన్ని.. అభిరుచులను సరికొత్తగా ఆవిష్కరించే సిరీస్ ఇది" అని అన్నారు.

విడాకుల విషయం నాకు తెలియదు



ఆర్తి రవి

తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన భర్త విడాకుల ప్రకటన చేశారంటూ ఆర్తి రవి బుధవారం ప్రకటన విడుదల చేయడంతో తమిళ హీరో జయం రవి విడాకుల వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ విషయంపై ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. 'మా వైవాహిక జీవితం గురించి మీడియా, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు చూసి ఆందోళనకు గురయ్యాను. 18 ఏళ్ళుగా పరస్పర విశ్వాసం, గౌరవంతో కుటుంబ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ విడాకుల ప్రకటన వల్ల మా గౌరవ మర్యాదలతో పాటు వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్టుగా భావిస్తున్నాను. నా భర్తతో మాట్లాడాలని, కలవాలని ఎన్నో సార్లు ప్రయత్నం చేశాను. కానీ, నాకు అలాంటి అవకాశం దక్కలేదు. నేను, నా పిల్లలు ఇబ్బంది పడుతున్నాం. వైవాహిక బంధం నుంచి వైదొలగాలనే ఈ నిర్ణయం పూర్తిగా ఆయన సొంతంగా తీసుకున్నది. దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించదలచుకోలేదు. అయితే, నా వ్యక్తిత్వానికి కళంకం కలిగించేలా బహిరంగంగా జరుగుతున్న ప్రచార దాడులను సహించలేకపోతున్నాను. ఈ అసత్య ప్రచారాన్ని తిరస్కరించడం నా తొలి కర్తవ్యం' అని ఆర్తి రవి పేర్కొన్నారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)



భారీ వర్షాలు, వరదలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కు కలిపి హీరో సాయిదుర్గ తేజ్ రూ. 20 లక్షలు విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు రూ. పది లక్షల చెక్కును విజయవాడలో అందించారు సాయి దుర్గ తేజ్. అలాగే అమ్మ అనాథాశ్రమానికి రూ. రెండు లక్షలు, ఇతర సేవా సంస్థలకు రూ. మూడు లక్షలు విరాళంగా అందించారు

సాహసనారి సంయుక్త



నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ వార్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో నిఖిల్‌కు జోడీగా నభానటేష్, సంయుక్త నటిస్తున్నారు. బుధవారం సంయుక్త పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. యుద్ధ భూమిలో విల్లును ఎక్కుపెడుతున్న యోధురాలిగా ఆమె లుక్ అలరించింది. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శర్వానంద్ సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం (శర్వా 37-వర్కింగ్ టైటిల్) నుంచి ఆమె పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో దియా అనే పాత్రలో ఆమె కనిపించనున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా లుదీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనూ సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహేశ్ చందు నిర్మాత. సమీరా అనే పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.

మలైకా ఇంట విషాదం



బాలీవుడ్ నటి మలైకా అరోరా ఇంట్లో విషాద ఘటన జరిగింది. మలైకా సవతి తండ్రి అనిల్ మెహతా ముంబైలో ఆరు అంతస్థుల భవంతి నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఆయనను ఆస్పత్రిలో చేర్పించారు. కానీ అప్పటికే ఆయన చనిపోయారని వైద్యులు తెలిపారు. అయితే అనిల్ మెహతాది ఆత్మహత్య కాదా అనే విషయం అధికారికంగా తెలియాల్సి ఉంది.

ఉన్నత విద్యలో ఇక ఒకే విధానం

- **అన్ని యూనివర్సిటీలు, కాలేజీలకు వర్తింపు**
- **2024-25 అకడమిక్ క్యాలెండర్ విడుదల**

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో ఏకరూప విధానాన్ని అమలు చేసేందుకు ఉన్నత విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ కోర్సులకు ఉన్నత విద్యాశాఖ 2024-25 అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏటా అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్నా యూనివర్సిటీలు దాన్ని అమలుచేయడం లేదు. ఒక్కో యూనివర్సిటీ ఒక్కోలా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అన్ని వర్సిటీలు ఒకే విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారమే బోధన, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది.

డిగ్రీ కోర్సులకు ఇలా..

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సాధారణ డిగ్రీ కోర్సుల సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 12న ప్రారంభమవుతాయి. డిసెంబరు 9 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 10న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 డిసెంబరు 23న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 21 నుంచి మే 3 వరకు పరీక్షలు జరుగుతాయి. మే, జూన్ నెలల్లో ఎనిమిది వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. మే 24న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-4 నవంబరు 25న ప్రారంభవుతుంది. ఏప్రిల్ 21 నుంచి జూన్ 14 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎనిమిది వారాల షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 23 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 13న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-6 నవంబరు 25న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-7 జూలై 1న ప్రారంభమవుతుంది. నవంబరు 4 నుంచి 16 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 7న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-8 నవంబరు 18న ప్రారంభమవుతుంది. మార్చి 24 నుంచి ఏప్రిల్ 5 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు విడుదల చేస్తారు.

బీటెక్‌కు ఇలా..

ఇంజనీరింగ్ సెమిస్టర్-1 తరగతులు ఆగస్టు 1న ప్రారంభమవుతాయి. డిసెంబరు 16 నుంచి జనవరి 4 వరకు పరీక్షలు జరుగుతాయి. జనవరి 25న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-2 జనవరి 6న ప్రారంభమవుతుంది. జూన్ 2 నుంచి 21 వరకు పరీక్షలు జరుగుతాయి. జూలై 11న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-3 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-4 డిసెంబరు 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. ఏప్రిల్, జూన్ నెలల్లో 8 వారాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు ఉంటుంది. సెమిస్టర్-5 జూలై 8న ప్రారంభమవుతుంది. నవంబరు 11 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయి. డిసెంబరు 21న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-6 డిసెంబర్ 2న ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 7 నుంచి 26 వరకు పరీక్షలు జరుగుతాయి. 8వారాల షార్ట్ టర్మ్ ఇన్‌టర్న్‌షిప్ ఉంటుంది. మే 17న ఫలితాలు ప్రకటిస్తారు. సెమిస్టర్-7 జూలై 29న ప్రారంభమై.. నవంబరు 25 నుంచి డిసెంబరు 14 వరకు పరీక్షలుంటాయి. జనవరి 4న ఫలితాలు విడుదల చేస్తారు. సెమిస్టర్-8 డిసెంబరు 16న ప్రారంభమై.. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు పరీక్షలు జరుగుతాయి. ఏప్రిల్ 26న ఫలితాలు ప్రకటిస్తారు.

డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూల్ మార్పు

మూడో విడత డిగ్రీ అడ్మిషన్లకు ఇటీవల విడుదల చేసిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. రిజిస్ట్రేషన్ గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించింది. 11 నుంచి 18 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని, 19న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపింది. 22న సీట్ల కేటాయింపు జరుగుతుందని, 22 నుంచి 25లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది.

జెత్వానీ మొబైల్ ఫోన్ ఎక్కడ?

- **వివరాలు తమ ముందుంచాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం**

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ నుంచి సీజ్ చేసిన మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాటిని భద్రపరిచేందుకు తీసుకున్న చర్యలను తెలపాలని కోరింది. ఎలక్ట్రానిక్ పరికరాలను భద్రపరచాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. విద్యాసాగర్ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చుకొని తన వాదనలు వినిపించేందుకు అనుమతించాలంటూ కాదంబరి దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. జెత్వానీ నుంచి పోలీసులు సీజ్ చేసిన పరికరాలను నిందితురాలికి వెనక్కి ఇవ్వకుండా ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, కోసూరుకు చెందిన కేవీఆర్ విద్యాసాగర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది టి.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. జెత్వానీ తరఫు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయి వాదనలు వినిపించేందుకు అనుమతించాలని కోరారు.

రహదారుల భద్రతపై హైకోర్టులో పిల్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రత, నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కమిటీ ఇచ్చిన మార్గదర్శకాలను రాష్ట్రంలో అమలు చేయట్లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న కేంద్ర రవాణాశాఖ కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సీఎస్, రవాణాశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ప్రత్యేకప్రధాన కార్యదర్శి, రహదారుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్, రవాణాశాఖ కమిషనర్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

కోటి ఇచ్చిన డిక్సన్, జీవీపీఆర్ ఇంజనీర్స్, నెక్కంటి సీ ఫుడ్స్, సంధ్య ఆక్వా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం దాతలు స్పందించి, ముఖ్యమంత్రి సహాయ నిధికి తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు. సంధ్యా మెరైన్స్ కేవీ ప్రసాద్ రూ.కోటి, జీవీపీఆర్ ఇంజనీర్స్ లిమిటెడ్ ఛైర్మన్ జీవీపీ వీరారెడ్డి, ఎండీ శేఖర్‌రెడ్డి రూ.కోటి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ సత్యప్రకాష్‌సింగ్ రూ.86 లక్షలు, వైశాఖి ఫౌండేషన్ ఎల్లంకి రవికుమార్ రూ.50 లక్షలు, దర్శి నియోజకవర్గ ప్రజల తరఫున రూ.37,16,200, మోడల్ డైరీ ఎండీ పీ ధనప్రకాష్ రూ.30 లక్షలు, నార్త్ అమెరికా కమ్మ సంఘం రూ.30 లక్షలు, దర్శి నియోజకవర్గ టీడీపీ మహిళా నేత గొట్టిపాటి లక్ష్మీ రూ.10 లక్షలు, మణిపాల్ హాస్పటల్స్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి, అసోసియేట్ డైరెక్టర్ జే రామాంజనేయరెడ్డి రూ.25 లక్షలు, ఆఫ్రికా, కెన్యా టీడీపీ తరఫున బొబ్బా శివప్రకాష్ రూ.20 లక్షలు, ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ రాజు, ఎండీ కేవీ సుబ్బయ్య రూ.10 లక్షలు, గుంటూరు డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రూ.1,84,500 సీఎంకు అందజేశారు. కాగా, అమరావతి సచివాలయంలో.. డిక్సన్ గ్రూప్ కంపెనీ ప్రతినిధులు రూ.కోటి, నెక్కంటి సీ ఫుడ్స్ యాజమాన్యం రూ.కోటి, సంధ్య ఆక్వా రూ.కోటి చెక్కును మంత్రి లోకేశ్‌ని కలసి అందజేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, రేస్ పవర్ సంజయ్‌గుప్తా రూ.25 లక్షలు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.11 లక్షలు, సినీ హీరో సాయి ధరమ్ తేజ్ రూ.10 లక్షలు అందజేశారు. కాగా, మంత్రి టీజీ భరత్ విజయవాడలోని ఊర్మిళా నగర్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు.

జాతీయ ప్రదర్శనకు ఎంపిక

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో చివరి సంవత్సరం విద్యార్థి సోను దాస్ క్యామెల్ కంపెనీ నిర్వహిస్తున్న జాతీయ క్యాంప్, చిత్ర ప్రదర్శనలో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. కర్ణాటక, హంపిలో నవంబర్ 25 నుంచి 29 వరకూ ఈ క్యాంప్ ఐదు రోజులపాటు జరగనుంది. ఈ క్యాంప్‌లో ఎంపికైన వర్ణచిత్రాలు వచ్చే ఏడాది జనవరిలో ముంబాయి జహంగిర్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శిస్తారు. నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగాధరరావు విద్యార్థిని అభినందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్ బాబు, అధ్యాపకులు పి.దేవకాంత్ పాల్గొన్నారు.

వినాయక విగ్రహానికి పూజలు

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు వినాయక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కుటుంబానికి క్షేమం జరగాలని, అభివృద్ధి మరింత రెట్టింపు అవ్వాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎల్.జయశ్రీ, డాక్టర్ ఎం.వి.రమణ, డాక్టర్ శ్రీకృష్ణ, విద్యార్థి సంఘాల నాయకులు అభిషేక్, హేమంత్ పాల్గొన్నారు.

జోగులాంబ హాల్ట్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తివేత

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్లాట్‌ఫాం పనుల కారణంగా వారంపాటు శ్రీబాల బ్రహ్మేశ్వర జోగులాంబ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నంబరు. 17252 కాచీగూడ - గుంటూరు, 17251 గుంటూరు - కాచీగూడ, 17254 ఔరంగబాద్ - గుంటూరు, 17253 గుంటూరు - ఔరంగబాద్ రైళ్లకు నిలుపుదల ఎత్తి వేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నందిగం సురేష్ పోలీస్ కస్టడీపై ముగిసిన విచారణ

మంగళగిరి, సెప్టెంబరు 11: వైసీపీ నాయకుడు, బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పోలీసు కస్టడీకి ఇవ్వాలని మంగళగిరి రూరల్ పోలీసులు వేసిన పిటీషన్‌పై మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. వాదనలు పూర్తి కాగా ఈ నెల 13న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి సురేష్‌బాబు చెప్పారు. ఇదిలా ఉండగా టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను ఈ నెల 5న మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కాగా సురేష్ విచారణకు సహకరించకపోవడంతో పోలీసు కస్టడీకి 8 రోజులు ఇవ్వాలని రూరల్ పోలీసులు కోర్టును ఆశ్రయించారు.

ద్విచక్ర వాహనం పైనుంచి జారి మహిళ మృతి

నాదెండ్ల, సెప్టెంబరు 11: ద్విచక్ర వాహనం పైనుంచి జారి పడగా బొక్కా కుమారి(33) అనే మహిళ బుధవారం మృతి చెందింది. కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన బొక్కా ఇస్సాక్, కుమారి దంపతులు కొద్దికాలం నుంచి గుంటూరులో ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారు. కుమారి మామకు ఆరోగ్యం బాగా లేకపోవటంతో ఆయన నరసరావుపేటలోని ఒక వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయన్ను చూసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి గుంటూరు వెళ్తుండగా సాతులూరు గ్రామ పరిధిలోని స్పీడు బ్రేకర్ వద్ద వెనుక కూర్చున్న కుమారి జారి కింద పడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావటంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరాడంబరంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ

పెదకాకాని, సెప్టెంబరు 11: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిరాడంబరంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ 1976లో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతూ నేడు కొన్ని లక్షల మందికి డిగ్రీలను, కొన్ని వేల మందికి డాక్టరేట్ పట్టాలను అందించి రాష్ట్రస్థాయితోపాటు జాతీయంగానూ తన ఉనికిని చాటుకుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు వారి వారి శక్తి మేర కృషిచేసి విశ్వవిద్యాలయ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నందుకు అందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయ పురోగతి నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంలో ఆచార్య నాగార్జున విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కె.రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ప్రమీలరాణి పాల్గొన్నారు.

నిక్షిప్తమైతే.. నిజాలు తెలుస్తాయేమో!



- పీఏసీఎస్ కంప్యూటరీకరణపై అక్రమార్కుల గుండెల్లో గుబులు
- బోగస్, బినామీ రుణాలు వెలుగులోకి వచ్చే అవకాశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) జరుగుతున్న అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. జిల్లా లోని సహకార సంఘాల రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించింది. అక్టోబర్ 2 నాటికి అన్ని సహకార సంఘాల్లోని రికార్డులన్నింటినీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని గడువు విధించారు. జిల్లాలోని 63 సహకార సంఘాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభం అయింది. ప్రభుత్వం విధించిన గడువులోగా కంప్యూటరీకరణ పూర్తి చేయించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ సహకార శాఖ అధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే సహకార శాఖలోని కొందరు మాత్రం రికార్డుల కంప్యూటరీకరణ కు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలు కంప్యూటర్లోకి ఎక్కితే బోగస్, బినామీ రుణాలు బయటకు వస్తాయన్న ఆలోచనతో చాలామంది ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచ్చు బిగిసినట్లే..

వ్యవసాయ పరపతి సంఘాలను అడ్డుపెట్టుకుని చాలా మంది రాజకీయ నాయకులు, అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడ్డారు. రైతుకు కనీస సమాచారం లేకుండానే వారి పేర్లతో రూ.కోట్లలో రుణాలు పొందారు. ప్రతి ఏడాది ఆ రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నారే తప్పా పూర్తిగా చెల్లించటం లేదు. రికార్డుల్లో మాత్రం రుణం పూర్తిగా చెల్లించినట్లు, మళ్లీ కొత్త రుణం మంజూరు చేసినట్లు ఉంటుంది. ఇటువంటి విధానం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా కొనసాగుతూ వస్తుంది. ఇదిగాక కొన్ని వేలమంది ఆయా సహకార సంఘాల్లో సభ్యులుగా ఉంటే కొద్దిమందికి మాత్రమే రుణాలు ఇస్తున్నారు.

కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు

ఉదాహరణకు ఫిరంగిపురం వ్యవసాయ పరపతి సంఘంలో 24 వేల మంది సభ్యులు ఉంటే అందులో కేవలం 550 మందికి ఏటా పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇలా చాలా సంఘాల్లో ఇటువంటి వ్యవహారాలు జరుతున్నాయి. పార్టీ ఏదైనా సొసైటీ అధ్యక్షుడుగా వస్తున్న వ్యక్తులు ఎంతోకొంత అవినీతి, అక్రమాలకు పాల్పడి వ్యవసాయ పరపతి సంఘాలను దోచుకున్నట్టు శాఖ అంతర్గత ఆడిట్‌లో బహిర్గతం అవుతుంది. సహకార సంఘాల రికార్డులన్నీ చేవ్రాతతో ఉండటంతో ఇటువంటి అక్రమాలకు అవకాశం ఉంటుంది. దాన్ని నివారించేందుకు కూటమి ప్రభుత్వం సహకార సంఘాల కంప్యూటరీకరణను తెరపైకి తెచ్చింది. ఇది జరిగితే గత కొన్నేళ్లుగా సొసైటీల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావటంతోపాటు, భవిష్యత్‌లో అటువంటి వాటికి అవకాశం ఉండదని సహకార శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

అమరావతిపై దుష్ప్రచారం వద్దు


ఉద్దండ్రాయునిపాలెం లంక వాసులకు నిత్యవసర సరకులను అందిజేస్తున్న మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్

- వర్షం పడితే ఎక్కడైనా నీళ్లు వస్తాయి
- జగన్‌రెడ్డిని జైల్ టూరిజం అంబాసిడర్‌గా పెట్టాలి
- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

తుళ్లూరు, సెప్టెంబరు 11: అమరావతి ముంపు అని వైసీపీ వారు ప్రచారం చేయవద్దని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం తాళ్ళాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం లంకల్లో డొక్కా పర్యటించి వరద బాధితులను పరామర్శించి పులి సుధాకర్ మెమోరియల్ ద్వారా ఏర్పాటు చేసన నిత్యవసర సరలను 160 కుటుంబాలకు ఆయన అందజేశారు. తుళ్లూరు మండలంలో లంక ప్రాంతం నివాసులకు వరద వల్ల ప్రతి సారి నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి లంక వాసులకు శాశ్వత గృహ కల్పన, భృతి ఏర్పాటు అయ్యేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో డొక్కా మాట్లాడుతూ వర్షం పడితే ఎక్కడైనా నీళ్ల వస్తాయన్నారు. గుంటూరుకు వరద నీరు వచ్చిందన్నారు. విజయవాడ బుడమేరు వరద వస్తే 175 నియోజకవర్గాల్లో పోటి చేసిన వారంతా ఏమైపోయారో తెలియటం లేదన్నారు. జగన్‌రెడ్డి హింసను ప్రోత్సహిస్తున్నారన్నారు. అధికారం పోతే అంతు తేలుస్తానని అనటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయటమేనన్నారు. ప్రజలకు జగన్‌రెడ్డి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నాడని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అక్రమ కేసులుపెడతానని జగన్‌రెడ్డి అనటం చూసి టెర్రరిస్టులు కూడా.. మేము అధికారంలోకి వస్తామంటారన్నారు. ఇలా మాట్లాడితే హింసను ప్రేరేపిస్తున్నారని వైసీపీని ఎన్నికల కమిషన్ రద్దు చేస్తుందన్నారు. హిస్టారికల్ , బుద్ధిస్ట్ టూరిజంలకు బ్రాడ్ అంబాసిడర్‌లను ఏర్పాటు చేసిన మాదిరిగా డార్క్ జైలు టూరిజం ఏర్పాటు చేసి దాని అంబాసిడర్‌గా జగన్‌రెడ్డిని పెట్టాలని కోరుకుంటున్నాని డొక్కా అన్నారు. బ్యారేజీని బోటులు గుద్దుకోవటం వెనక కుట్ర కోణం దాగి ఉంటే ఎంతటి వారైనా చట్టం వదిలిపెట్టదని హెచ్చరించారు.

వరద బాధితులకు రూ. 50 లక్షల విరాళం

- సంగం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్ (చేబ్రోలు) సెప్టెంబరు11: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి సంగం డెయిరీ రూ.50 లక్షల విరాళాన్ని అందించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు. బుధవారం సంగం డెయిరీ పాలకవర్గ సమావేశం జరిగింది. పలు కీలక నిర్ణయాలను చర్చించిన అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది సంగం డెయిరీ రూ. 1877 కోట్ల టర్నోవర్ సాధించినట్లు చెప్పారు. పాల రైతులకు బోనస్ అందించిన తర్వాత రూ.12 కోట్ల లాభాలను సాధించినట్లు ప్రకటించారు. విజయవాడ నగరం ముంపునకు గురైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సంగం డెయిరీ పాలు, మజ్జిగ పంపిణీ చేశామన్నారు. బాధితుల సహాయార్థం సంగం భాగస్వామి కావటం సంతోషంగా ఉందన్నారు. పాల ఉత్పత్తిదారులు వరద బాధితులుగా మారటంతో వారి పశువుల సంరక్షణ కోసం 70 మెట్రిక్ టన్నుల పశు దాణాను ఉచితంగా అందించామన్నారు. ప్రభుత్వం కూడా రాయితీపై తక్కువ ధరకు పశుదాణా కోరిందని సరఫరా చేసినట్లు చెప్పారు. కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తమను వేధింపులకు గురిచేసి కేసులు నమోదు చేసినప్పటికీ సామాజిక బాధ్యతగా సీఎం సహాయ నిధికి విరాళం అందించాం అన్నారు. అలాగే సంగం డెయిరీ చట్టపరంగా అనుసరించాల్సిన విధానాలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని అనంతపురంతోపాటు, ఐదు చోట్ల బీఎంసీలు ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. భవిష్యతుకు అనుగుణంగా సంగం డెయిరీని మరింత విస్తరణ ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో కూడా త్వరలోనే కార్యకలాపాలు జరగనున్నట్లు వివరించారు. ఎండీ పి.గోపాల కృష్ణన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదు


మాట్లాడుతున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన

గుంటూరు, సెప్టెంబరు 11: వరద బాధితులకు ఒక్క రూపాయి కూడా సహాయం చేయని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం లాడ్జి కూడలిలోని జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. కృష్ణా నదిలో బోటులను వదిలి బ్యారేజీని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వైసీపీ నాయకులు, వరద బాధితులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని వారు ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంపై వైసీపీ నేతలు జరిపిన దాడిని, అక్కడ తోపులాటలో రాళ్ల పడ్డాయని జగన్‌మోహన్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సొంత నిధుల నుంచి వరద బాధితులకు రూ.6 కోట్లు విరాళం అందజేసిన గొప్ప నాయకుడని తెలిపారు. మరో పక్క సీఎం చంద్రబాబు కూడా రాత్రింబగళ్లు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉండి బాధితులకు అందే సాయం స్వయంగా పర్యవేక్షించారని చెప్పారు. ఇవేమి కనిపించని వైసీపీ నాయకులకు, పవన్‌ను, చంద్రబాబును విమర్శించడం చూసి ప్రజలు వైసీపీ నేతల తీరును అసహ్యించుకుంటున్నారని ధ్వజమెత్తారు. జిల్లా పర్యటనకు వచ్చిన జగన్‌రెడ్డి బాధిత రైతాంగాన్ని కాకుండా సబ్ జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను పరామర్శించడం చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. రైతులను కలసి పది నిమిషాలు ఓదార్చే సమయంలేని జగన్ రెడ్డికి, మీడియా ఎదుట 45 నిమిషాల పాటు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించేందుకు మాత్రం సమయం ఉందని విమర్శించారు. నదికి, డ్రెయిన్‌కు, కాలువకు తేడా తెలియని వ్యక్తి (జగన్) ముఖ్యమంత్రిగా ఎలా పని చేశాడో తమకు అర్థం కావడం లేద న్నారు. తప్పు చేసిన వారిని కూటమి ప్రభుత్వం విడిచిపెట్టదని, అప్పుడు టైం టేబుల్ వేసుకొని మరీ మాజీ సీఎం జగన్‌రెడ్డి తమ పార్టీ నేతలను పరామర్శించేందుకు జైళ్లకు వెళ్లాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. సమావేశంలో జనసేన కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, నాయకులు అడపా మాణిక్యాలరావు, చట్టాల త్రినాథ్, పాకనాటి రమాదేవి, యడ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్న వైసీపీ


ఎస్‌ఐ అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

రొంపిచర్ల, సెప్టెంబరు 11: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వగ్రామమైన బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు వైకాపా నాయకులు అడ్డు తగిలారు. మంగళవారం రాత్రి గ్రామంలోని ఉప్పు ఏడుకొండలకు చెందిన సొంత స్థలంలో విగ్రహ నిర్మాణానికి దిమ్మెను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామనుకుంటున్న తరుణంలో గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు కాలనీకి వచ్చి హల్‌చల్ చేశారు. విగ్రహం ఏర్పాటు చేయవద్దంటూ వారిని బెదిరించారు. తమ అనుమతితోనే ఏ పనులైనా చేయాలని వైసీపీ నాయకులు పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో విగ్రహం ఏర్పాటు ఎలా చేస్తారని వైసీపీ నేతలు ప్రశ్నించినట్లు తెలిపారు. తమను బెదిరించటంపై రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తమ సొంత స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటుంటే ఈ విధంగా చేయటం దారుణమన్నారు. తమకు ప్రాణ హాని ఉందని ఎస్‌ఐ అశోక్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 40 మంది కాలనీ వాసులు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అశోక్ మాట్లాడుతూ గ్రామంలోకి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రోద్బలంతోనే వైసీపీ నాయకులు తమను బెదిరిస్తున్నారని తెలిపారు.

అక్రమ మైనింగ్ వాస్తవమే..


మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆనంద్, జెస్సీ

నకరికల్లు, సెప్టెంబరు 11: నకరికల్లు మండలంలో క్వార్ట్ అక్రమ మైనింగ్ వాస్తవమేనని ఆ శాఖ అధికారులు నిర్ధారించారు. 'క్వార్ట్జ్‌పై కన్ను' శీర్షికతో అక్రమ తవ్వకాలపై వెలువడిన కథనానికి మైనింగ్ అధికారులు స్పందించారు. బుధవారం మైనింగ్ జరుగుతున్న క్వార్ట్ మైనింగ్ ప్రాంతాలను పరిశీలించారు. మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి, మైనింగ్ అనుమతులు తీసుకున్న ప్రాంతానికి సంబంధం లేకుండా ఉన్నట్టు గుర్తించారు. ఎంత మేర అక్రమంగా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మైనింగ్ జరిగిందనే విషయాన్ని సర్వే చేశారు. ఏయే ప్రాంతాల్లో మైనింగ్ జరిగిందో, ఏ స్థాయిలో జరిగిందో, సర్వే చేసి నివేదిక సిద్ధం చేయనున్నట్టు అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. ఆనంద్ తెలిపారు. జిల్లా మైనింగ్ అధికారి నాగిని ఆదేశాల మేరకు తాను, మైనింగ్ సర్వేయర్ జెస్సీ అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఏ ప్రాంతానికి అనుమతులు ఉన్నాయి, అనుమతి లేని ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేస్తామన్నారు. అక్రమ మైనింగ్‌పై చేజర్ల, నరసింగపాడు, నకరికల్లులో, త్రిపురాపురం కొండ ప్రాంతంలోనూ పరిశీలించినట్టు తెలిపారు. సర్వే నంబరు 97లో మైనింగ్ అనుమతి కోసం రెండు హెక్టార్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, కాని క్లియరెన్స్ రాక ముందే అక్రమంగా మైనింగ్ జరిగినట్టు గుర్తించారు.

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దుర్గాప్రసాద్, సతీష్‌శర్మ, మాజీ మంత్రి ఆలపాటి

గుంటూరు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ముందుకొచ్చింది. వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షల చెక్కును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ సీఎం చంద్రబాబుకు విజయవాడలో అందజేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం కన్వీనర్ కరి నాగలక్ష్మి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదు


మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 11: ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు జగన్‌కు లేదనీ, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో కూడా జగన్ తీరు మారలేదని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. టీడీపీ ఆఫీస్‌పై దాడిని సమర్థించుకోవటం దారుణమని, వరద కారణంగా జనం కష్టాల్లో ఉంటే ప్రజలను పరామర్శించకుండా జైలుకు వెళ్లి ఓ క్రిమినల్‌ను పరామర్శించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైసీపీకి 11 సీట్లు కూడా ఎందుకు ఇచ్చామని ప్రజలు బాధ పడుతున్నారని అనగాని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సహజ వనరులను దోచుకున్నారని విమర్శించారు. భూములను కబ్జాలు చేసి కోట్లాది రూపాయలు దోచుకున్న ఘనత జగన్‌ది అన్నారు. రాష్ట్రం వరదలు వచ్చి ప్రజలు నానా ఇబ్బందుల్లో ఉంటే వారికి బాసటగా నిలవకపోగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను పరామర్శించాలంటే రోడ్డుపైనే స్టేజీ వేసి రైతులను అక్కడకు తీసుకొచ్చి పరామర్శించారే తప్పా ఎక్కడ మునిగిన ప్రాంతానికి వెళ్లిన దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టర్ ఆఫీస్‌ను క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకుని 9 రోజుల పాటు అక్కడే ఉండి నిరంతరం వరద బాధితులకు కావాల్సిన ఆహారం, సదుపాయాలను నేరుగా బాధితుల వద్దకే నీళ్లల్లో నడుచుకుంటూ పడవల్లో వెళ్లి అండగా నిలిచారని తెలిపారు. కేంద్ర బృందం బాపట్ల జిల్లాలో లంకగ్రామాల్లో భట్టిప్రోలు మండలంలో కృష్ణా కరకట్ట, రేపల్లె మండలం రావిఅనంతవరం వద్ద పరిశీలించగా చెరుకుపల్లి మండలం కనగాలలో నేటికి వేలాది ఎకరాలు నీటిలోనే ఉన్న పంటను చూపించి ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు.

నోరు విప్ప వద్దనే జగన్ ములాకత్ రాజకీయం


ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 11: ప్రకాశం బ్యారేజీని కూల్చి లక్షల మందిని ముంచాలన్న కుట్ర కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్ నోరు విప్ప కూడదనే జగన్ ములాకత్ రాజకీయం చేస్తున్నారని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో విరుచుకుపడ్డారు. ప్రజలు విపత్తుల్లో ఉంటే సాయం చేయాల్సింది పోయి మహా విధ్వంసానికి ప్లాన్ చేసి దొరికిపోవడంతో నిజాలు బయట పడకుండా ఉండేందుకే జగన్ పాట్లు పడుతున్నారని అన్నారు. ప్రకాశం బ్యారేజీ కూల్చేసే కుట్ర వెనుక మాజీ సీఎం జగన్, సజ్జల, శీతల రఘురాం, నందిగం సురేష్ హస్తం ఉందని ఆరోపించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో గుంటూరు జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎంపీ సురేష్‌ను జగన్ ములాకత్‌లో కలవడంపై ఈమేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. జైల్లో పోలీసులు గట్టిగా అడిగినా తమ పేర్లు ఎక్కడా చెప్ప వద్దని సమాచారం చేరవేయడానికే ఆగమేఘాలపై జగన్ ములాకత్‌కు పరుగులు తీశారన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జగన్ చేసిన తొలిరాజకీయ పర్యటన నాడు నెల్లూరు జైల్లో ఉన్న మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో ములాకత్ అని, ఇప్పుడు గుంటూరు జైలుకు వచ్చి నందిగమ సురేష్ పరామర్శకు వచ్చారన్నారు. ఏనాటికైనా జగన్ సహా అతడి బ్యాచ్ మొత్తం జైలుకు పోవడం మాత్రం స్పష్టం అన్నారు.

ప్రత్తిపాటి పుల్లారావుకు మాతృవియోగం


చిన నారాయణమ్మ

చిలకలూరిపేట, సెప్టెంబరు11: మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి ప్రత్తిపాటి చిన నారాయణమ్మ(85) గుండెపోటుతో బుధవారం ఉదయం హైదరాబాదులో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతున్నారు. వైద్య సేవలు పొందుతూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన నారాయణమ్మ తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన వెంటనే పుల్లారావు హుటాహుటిన చిలకలూరిపేట నుంచి హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో ఆమె భౌతికకాయం వద్ద ఆయనతోపాటు బంధువులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించారు. అనంతరం ఆమె భౌతికకాయాన్ని రాత్రి 7 గంటల ప్రాంతంలో చిలకలూరిపేటకు తీసుకువచ్చారు. గురువారం ఉదయం చిలకలూరిపేటలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు పట్టణ ప్రముఖులు పుల్లారావు గృహం వద్దకు వచ్చి చిన్న నారాయణమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. చిన నారాయణమ్మ మృతిపట్ల టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

రషీద్ ఎంపికపై హర్షం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 11: ఇండియా-ఏ క్రికెట్ జట్టులో గుంటూరు జిల్లాకు చెందిన షేక్ రషీద్ ఎంపికవ్వడంపై ఆయన తల్లిదండ్రులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొత్తగా ప్రకటించిన ఇండియా ఏ జట్టులో రషీద్‌కు అవకాశం ఇవ్వడంపై తల్లిదండ్రులు జ్యోతి, బాలీషావలీలు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జీవితంలో మరపులేని రోజు అంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అండర్-19 వరల్డ్ కప్ గెలుపులో రషీద్ కీలకపాత్ర పోషించాడని, ఐపీఎల్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉండి రాణించారని గుర్తుచేశారు. ముఖ్యంగా అండర్-19 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో రషీద్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడని అన్నారు. క్రికెట పట్ల రషీద్‌కు ఉన్న ఆసక్తిని గమనించి, ప్రత్యేక శిక్షణ ఇప్పించామని, ఆయన ఎదుగుదలలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రోత్సాహం ఎంతో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

30,198 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 32,598 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 30,198 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,975 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15500	334	8000	15800
నెంబరు. 5	9000	15500	నెంబరు. 5	9000	13000
273	10000	13500	273	10000	12000
341	8000	16000	341	8500	15000
4884	--	--	4884	--	--
సూపర్ 10	10500	10500	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18600	తేజ	8000	18500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8500	13500
దేవనూరు డీలక్స్	8500	15000	దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు



పిడుగురాళ్లలోని తారకరామ కాకతీయ సేవా సమితి వినాయక మండపంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవాలు

● పోటా పోటీగా గణపతి లడ్డూ వేలం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: వినాయకచవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల్లో కొన్ని 5వ రోజు బుధవారం నిమజ్జనానికి తరలివెళ్లాయి. జానపాడురోడ్డులోని విఘ్నేశ్వర సేవాదళం ఆధ్వర్యంలో, ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లోని గణేష్ మిత్రమండలి, బ్రహ్మంగారి గుడివద్ద కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతో పాటు మరికొన్ని విగ్రహాలను ముందుగా పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని పలు గణేషుని మండపాలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విచ్చేసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

తారకరామ కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో బ్రహ్మంగారి గుడివద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో 17 కేజీల లడ్డును రూ.1.65 లక్షలకు గుడె బాలకోటేశ్వరరావు (సిగ్మా) దక్కించుకున్నాడు. ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లో గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద 30 కేజీల తాపేశ్వరం లడ్డును యక్కల శ్రీను రూ.64,116 దక్కించుకున్నాడు. జానపాడురోడ్డులోని పట్టణ ఆర్యవైశ్య విఘ్నేశ్వర సేవాదళం ఆధ్వర్యంలో 27 కేజీల లడ్డును జుజ్జూరి హరి బృందం రూ.70 వేలకు దక్కించుకున్నారు.

దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీలోని దక్షణగడ్డలో వినాయకుడి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డుని రూ.23 వేలకు గ్రామానికి చెందిన గంధ్రిక శ్రీనివాసరావు దక్కించుకున్నారు. 5వ రోజు గణపతి నవరాత్రులలో భాగంగా అధిక సంఖ్యలో విగ్రహాలను పొందుగల కృష్ణానది వద్ద నిమజ్జనం చేశారు. దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు పర్యవేక్షణలో ఎస్ఐ శివనాగరాజు బందోబస్తు నిర్వహించారు. మాదినపాడు గ్రామంలో రామాలయం గుడివద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి మండలంలో నిర్వహించిన లడ్డూని గడిపూడి నరేంద్ర రూ. 75 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

మాచవరం: మాచవరం, పిల్లుట్ల, కొత్త గణేషునిపాడు, మల్లవోలు, మోర్జంపాడు తదితర గ్రామాల నుంచి వినాయకుని విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి అనంతరం గోవిందాపురం వద్ద బల్లకట్టు ద్వారా కృష్ణా నదిలో నిమజ్జనంచేశారు. ఎస్ఐ సతీష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కారంపూడి: పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో వినాయక మండపం వద్ద స్వామి వారికి నివేదించిన లడ్డు ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా ఆతుకూరి కృష్ణారావు అండ్ సన్స్ రూ. 1.75 లక్షలకు సొంతం చేసుకున్నారు. అనంతరం స్వామి వారిని బాణాసంచాలు, మేళతాళాలు, నృత్యాల నడుమ గ్రామంలో ఊరేగించి కుడికాలువలో నిమజ్జనం చేశారు.

పెదకూరపాడు: పెదకూరపాడులోని మిట్టసెంటర్‌లో గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుకి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

నకరికల్లు: గుండ్లపల్లి గ్రామంలో గణేషుని మండపం వద్ద నిర్వహించిన వేలంలో లడ్డూని రూ 1.07 లక్షలకు గజవల్లి చిన రామకోటేశ్వరరావు కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. అలాగే గుండ్లపల్లి గ్రామంలో రూ.1.06 లక్షలకు పలికింది. బుధవారం తెల్లవారు జామున గుండ్లపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద 5కిలోల లడ్డుని గ్రామానికి చెందిన వందనపు గురులక్ష్మి రూ1.06 లక్షలకు దక్కించుకున్నారు.

రెంటచింతల : వినాయక నిమజ్జనోత్సవం, పూజ కార్యాక్రమంలో పాల్గొని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ పాల్గొని యువ ఇంజనీర్లకు మార్గ నిర్దేశం చేశారు వినాయకుని లడ్డూని వేలంలో దేశం ఓబులరెడ్డి రూ.78 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఈ సుబ్రహ్మణ్యం,డీఈ నాగరాజు,ఏడీఈ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహం బుధవారం రాత్రి నిమజ్జనానికి తరలింది. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మేళ తాళాలతో, బాణ సంచా కాల్పులతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. కృష్ణా నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నట్టు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ కాంగ్రు కాశయ్య తెలియ జేశారు.

నిమజ్జన ఊరేగింపులో తోపులాట

మాచర్ల రూరల్: వినాయక విగ్రహ ఊరేగింపులో ఒకే సామాజిక వర్గంలోని ఇరు గ్రూపుల మధ్య తోపులాట జరిగిన సంఘటన మండలంలోని జమ్మలమడకలో మంగళవారం రాత్రి జరిగింది. పార్టీ మార్పు విషయంపై ఏర్పడిన వివాదం ఉద్రిక్తతక దారితీసింది. ఈక్రమంలో ఇరు వర్గాలవారు బాహాబాహీకి దిగారు. సమాచారం తెలుసుకున్న మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ నారాయణ తమ సిబ్బందితో గ్రామానికి చేరుకొని ఇరు వర్గీయులను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

బకాయిల సమస్యను పరిష్కరించాలి

క్రోసూరు, సెప్టెంబరు 11 : ఉపాధ్యాయుల పెండింగ్ ఆర్థిక బకాయిల సమస్యను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ సభ్యత్వ నమోదు సందర్భంగా బుధవారం క్రోసూరులో వారు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి మధ్యంతర భృతి ప్రకటించాలని, పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, విద్యారంగాన్ని అతలాకుతలం చేసిన జీవో 117ను రద్దుచేయాలని కోరుతూ ఎంఈవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జీ లూకా, షేక్ ఖాజావలి, ప్రకాశరావు, బీ నరసింహారెడ్డి, మోహన్ బాబు, వెంకటరావు, శ్రీదేవి, అలివేలు పాల్గొన్నారు.

సైనికుడిలా పనిచేసిన సీఎం



పెదకూరపాడులో పర్యటిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

● వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరు
● బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం
● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, సెప్టెంబరు 11 : విజయవాడ వరద సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 70 ఏళ్ల పైబడినా సైనికుడిలా పని చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విజయవాడ వరద ముంపునకు ప్రభుత్వమే కారణమంటూ వైసీపీ విష ప్రచారం చేస్తుందని, వాస్తవాలను ప్రజలు కళ్లారా చూస్తున్నారని, ఆ పార్టీ నేతల తప్పుడు వ్యాఖ్యలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ యాంత్రాంగాన్ని, కూటమి నేతలను ప్రమత్తం చేసి రంగంలోకి దించి వరదల కారణంగా మరింత భారీ నష్టం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. వర్షాలను, వరదలను లెక్క చేయకుండా పది రోజులుగా బాధితుల కోసం చంద్రబాబు చేసిన శ్రమ యువకులు సైతం చేయలేరన్నారు. రేయింబవళ్లు ప్రజలను అంటి పెట్టుకొని, ఇంటింటికి తిరుగుతూ ప్రజల ఆరోగ్యం, భద్రతపై ఆరా తీస్తూ తిరుగుతున్నారంటే బాధితుల పట్ల ఆయన శ్రద్ధ ఏపాటితో అర్థం చేసుకోవచ్చన్నారు. నష్ట పోయిన వారందరినీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లం కొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, టీడీపీ నేతలు అప్పా రావు, షేక్ ముంతాజ్, పరుచూరి పూర్ణచంద్రరరావు, మద్దినేని నర సింహారావు, నెల్లూరి మల్లికార్జునరావు, మక్కెన సాగర్, సర్పంచ్ గుడిపూడి రాజు, పమిడాల వెంకటరావు, మాదినేని సుధాకర్, ప్రసాదు, కావూరి సుజాత, ఏటుకూరి బ్రహ్మయ్య, షేక్ అజ్మొల్లా, గుండపనేని బాషా, మిలటరీ మౌలాలి, షేక్ రఫీ, షేక్ మస్తాన్ షరీఫ్, జాగర్లమూడి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● గృహోపకరణాలు దగ్ధం ..

దాచేపల్లి, సెప్టెంబరు 11: నారాయణపురంలోని తాళం వేసి వున్న ఓ ఇంటిలో విద్యుత్ షార్ట్ సూర్క్యూట్ ఏర్పడి విలువైన విద్యుత్ పరికరాలు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీలోని నారాయణపురంలో గుదె జానకిరామయ్య అపార్టుమెంట్‌లో 3వ అంతస్తులో సుభాని అనే వ్యక్తి నివాసముంటున్నాడు. భార్యాబిడ్డలు ఊరికి వెళ్లడంతో సుభాని ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. ఇంట్లో నుంచి దుర్వాసనతో కూడిన పొగ వస్తూ, పెద్దపెద్ద శబ్ధాలు ఏర్పడుతుండటంతో స్థానికులు భయపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావు, ఎస్ఐ శివ నాగరాజులు సాగర్ సిమెంట్స్ యాజమాన్యానికి సమాచారం ఇవ్వగా ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి తాళాలు పగులగొట్టి విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలను ఆర్పివేశారు. కొన్ని వస్తువులు దగ్ధమవడంతో కొంత ఆస్తి నష్టం జరిగినట్లుగా స్థానికులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ అమర వీరుల దినోత్సవం

మాచర్లటౌన్, సెప్టెంబరు 11: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో బుధవారం అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీ అధికారులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సబ్ డిఎఫ్‌వో విజయ, ఫారెస్ట్ రేంజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: కొండమోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య 2 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శివనాగిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోదారులు గమనించి సహకరించాలని కోరారు.

పోషకాహార వారోత్సవాలు

దాచేపల్లి, సెప్టెంబరు 11: మండల పరిధిలోని కేశానుపల్లి కస్తూర్బా పాఠశాలలో బుధవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఎంఎస్‌కే సునీత జీవన నైపుణ్యాలు గురించి విద్యార్థినులకు తెలియజేశారు. మహిళలు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత, బాల్య వివాహాల గురించి వివరించారు. ఆయా కార్యక్రమాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీలరాణి, భాగ్యలక్ష్మి, ఖాశింబీ, రత్నకుమారి, నారాయణమ్మ, రాజేశ్వరి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

సత్తెనపల్లి, సెప్టెంబరు 11: పాఠశాలల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27లోపు పాఠశాల పూర్తి సమాచారాన్ని తప్పులు లేకుండా యూడైస్ క్వార్టర్‌లో నింపాలన్నారు. ఏవరైనా తప్పుడు సమాచారం నింపితే ప్రధానోపాధ్యాయులదే బాధ్యత అని హెచ్చరించారు. మరో ఎంఈవో రాఘవేంద్రరరావు వివిధ అంశాల గురించి వివరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాగాణి పొలంలోకి ప్రవేశించిన పులిచింతల బ్యాక్ వాటర్

130 ఎకరాల్లో పంట నష్టం

దాచేపల్లి, సెప్టెంబరు 11: కృష్ణానది వరద నీటి ప్రవాహంతో 130 ఎకరాలు నీటమునిగాయి. 91 మంది రైతులు పంట నష్టపోయినట్లు వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం దాచేపల్లి మండలంలోని కృష్ణానది తీరప్రాంత గ్రామాలైన పొందుగల, రామాపురం, కాట్రపాడు గ్రామాలలో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. 75 ఎకరాలలో పత్తి పంట, 15 ఎకరాలలో వరి, 41 ఎకరాలలో మిర్చి పంట నష్టపోయినట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.

అక్రమ వసూళ్లతో అప్రమత్తం

● వినియోగదారులను హెచ్చరించిన విద్యుత్‌శాఖ అధికారులు

మాచర్లటౌన్, సెప్టెంబరు 11: మాచర్ల డివిజన్ పరిధిలో కొందరు విద్యుత్ గృహాలకు వెళ్లి విద్యుత్ సర్వీసు నంబరు ప్లేట్లు బిగించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాంటి అక్రమ వసూళ్లదారులతో అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు విద్యుత్ వినియోగదారులను బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నంబరు ప్లేటు మార్పు విషయమై తాము ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గ్రహించి ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు సూచించారు.

రైతులకు అవగాహన కల్పించండి

మాచర్లటౌన్, సెప్టెంబరు 11: పత్తి, వరి సాగులో పాటించాల్సిన మేలైన వ్యవసాయ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని డీడీఏ శివకుమారి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతిక సామర్థ్యాలు పెంపొందించేందుకు జిల్లా వనరుల కేంద్రం ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో మెళకువలపై రైతులకు సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం అధికారి పీ.ప్రవీణ్‌కుమార్, శాస్త్రవేత్త సైదానాయక్, మాచర్ల ఏడీఏ జగదీశ్వరెడ్డి, ఏవోలు లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, అమీర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 11 : పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 29,704 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 16వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతుందని తెలిపారు. పులిచింతల గేట్లు మూసి వేశారు.

సీపీఎం నేత నాగేశ్వరరావు మృతి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: పట్టణ సీపీఎం రెండవ శాఖ కార్యదర్శి బుంగా నాగేశ్వరరావు బుధవారం మృతి చెందారు. పిడుగురాళ్ల మండలంలో సీపీఎం అభివృద్ధికి, కార్మికులు, కర్షకుల సమస్యలపై బుంగా నాగేశ్వరరావు అనేక పోరాటాలు చేశారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, గోపాలరావులు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కొక్కెర కోటమ్మ (ఫైల్)

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: పట్టణంలోని 2వ వార్డుకు చెందిన కొక్కెర కోటమ్మ (101)అనే శతాధిక వృద్ధురాలు బుధవారం మృతి చెందినట్లు మాజీ కౌన్సిలర్ కొక్కెర కొండలు తెలిపారు. కోటమ్మకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు, 9 మంది మనవళ్లు, 9 మంది మనవరాళ్లు, 11 మంది మునిమనవళ్లు, మునిమనవరాళ్లు వున్నారు. కోటమ్మ మృతదేహాన్ని పిడుగురాళ్ల జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గండికోట వెంకటేశ్వర్లు, రాంబాబు, లింగయ్య, జక్కుల వీరస్వామి, కొండలు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు

14న జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, సెప్టెంబరు 11: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు కోరారు. బుధవారం కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ స్టేషన్‌ల పరిధిలో రాజీ పడదగిన కేసులన్నీ పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.ప్రజల్లో కక్షలు, కార్పణ్యాలు పెరగకుండా తొలిదశలోనే కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయాధికారులు కౌషిత్, హుస్సేన్, ప్రియదర్శిని, సీఐలు శ్రీనివాసరావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి జగన్‌కు లేదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 11 : విజయవాడ ప్రజలు కష్టాల్లో ఉంటే కనీస సహాయ కార్యక్రమాలు నిర్వహించక పోగా బాధితులకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌ను విమర్శించే స్థాయి జైలు పక్షి జగన్‌మోహన్ రెడ్డికి లేదని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి వక్కంటి అజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వరద బాధితులకు కనీస సాయం అందించని వైసీపీ నేతలకు కూటమి నేతలపై విమర్శలు చేయటం తగదన్నారు. వైసీపీ పాలనలో అనేక దుర్మార్గాలకు పాల్పడి నేడు జైలు పాలైన సురేష్‌ను పరామర్శించేందుకు జైలుపక్షి జగన్ వెళ్లడం హస్యాస్పదమన్నారు. వరద బాధితుల వద్దకు ఒక్కసారి చుట్టంచూపుగా వచ్చిపోయిన జగన్‌కు ప్రజల మధ్య ఉంటూ, వారికి అన్నివిధాలా అండగా ఉన్న కూటమి నేతలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు.

వర్షాల పరిహారంపై ఇంటింటి సర్వే

● డీఎల్‌డీవో గబ్రూనాయక్ వెల్లడి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: పల్నాడు ప్రాంతంలో గతవారం కురిసిన అధిక వర్షాలకు గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో సుమారు 50 గృహాలు దెబ్బతిన్నాయని, వీటి నమోదుకు ఇంటింటి సర్వే చేపడుతున్నా మని గబ్రూనాయక్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో 20కి పైగా, మాచర్ల నియోజకవర్గంలో 20 వరకు గృహాలలో కొన్ని పాక్షికంగా, మరికొన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న గృహాల పరిహారంపై ఇంజనీరింగ్ సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్నారని, దెబ్బతిన్న తీవ్రత మేరకు పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన తుమ్మలచెరువు సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. హాజరు పట్టికను తనిఖీచేసి సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిడుగు రాళ్ల, దాచేపల్లి, గురజాల పట్టణాలలోని సచివాలయ సిబ్బంది కొందరు అందుబాటులో లేకుండా సంతకంచేసి వెళ్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు రోజుకు మూడుసార్లు హాజరు వేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గబ్రూనాయక్ తెలిపారు. మున్సిపల్, మండల అధికారులు తరచూ సచివాలయాలను సందర్శించాలని తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

బెల్లంకొండ, సెప్టెంబరు 11 : బెల్లంకొండ మండలంలోని గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. వెంకటాయపాలెం గ్రామ సమీపంలోని కోళ్ళూరు వెళ్ళే రహదారిలో పేరంటాళమ్మ గుడి పక్కన నాలుగు రోజుల క్రితం గుప్త నిధులకోసం జేసీబీతో తవ్వకాలు జరిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముంపు గ్రామాల్లో, పురాతన ఆలయాల వద్ద నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారు. గత కొద్ది రోజుల క్రితం పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామ మైన కామేపల్లి గ్రామ ఆలయం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్థులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ముంపు గ్రామాల్లో ఎవరూ నివాసం ఉండక పోవటంతో పురాతన ఆలయాన్ని టార్గెట్ చేసుకొని తవ్వకాలు జరుపుతున్నారు. దానిలో భాగంగానే వెంకటాయపాలెం అటవీ ప్రాంతంలో పేరంటాళమ్మ గుడి సమీపంలో గుప్త నిధుల కోసం 8 అడుగుల లోతు తవ్వకాలు జరిపారు. అధికారులు స్పందించి గుప్త నిధుల తవ్వకందారులపై నిఘా ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వర్షాలకు గురజాల-నకరికల్లు రహదారిలో జూలకల్లు వద్ద దెబ్బతిన్న కల్వర్టు

అధిక వర్షాలకు రహదారులు ఛిద్రం

● రూ. కోటికి పైగా నష్టం ● ఆర్అండ్‌బీ ఏఈ యూసఫ్ వెల్లడి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 11: అధిక వర్షాలకు గురజాల నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లోని రహదారులు దెబ్బ తిన్నాయని ఆర్అండ్‌బీ ఏఈ యూసఫ్ తెలిపారు. పిడుగురాళ్ల నుండి గోవిం దాపురంవెళ్లే రహదారి, కోనంకి గ్రామానికి వెళ్లే లోలెవల్ చప్టా దెబ్బతిన్నాయని ఏఈ తెలిపారు. అదేవిధంగా గురజాల-నకరికల్లు రహదారిలో జూల కల్లు గ్రామ సమీపంలో వున్న పైపు కల్వర్టు దెబ్బతిన్నట్లు గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా అధిక వర్షాలకు గురజాల నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు కోటి రూపాయల వరకు రహదారులు దెబ్బతిన్నాయని, వాటికి త్వరలో మరమ్మతులు చేసేందుకు తగిన నిధులపై అంచనాలు తయారు చేయడం జరిగిందని తెలిపారు. కోనంకి సమీపంలోని లో లెవల్ చప్టాకు మరమ్మతులు, నూతన వెంతెన నిర్మాణానికి కూడా అంచనాలు తయారు చేయడం జరిగిందన్నారు. మొత్తం మీద అధిక వర్షాలకు సుమారు కోటి రూపాయల మేర రహదారులు దెబ్బతిన్నాయని ఏఈ యూసఫ్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ పూర్తి

అమరావతి, సెప్టెంబరు 11: మండల పరిధిలోని 8 గ్రామాలలో వరద ముంపు బారిన పడిన 499 కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం బుధవారం పూర్తి చేశారు. పంపిణీలో చివరిగా పెద మద్దూరు గ్రామంలో బాధిత కుటుంబాలకు గ్రామస్థాయి అధికారులతో పాటు పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు, గ్రామ టీడీపీ నాయకులు పొదిలె శ్రీనివాస్ తదితరులు పాల్గొని నిత్యావసర సరుకులు అందజేశారు.

లంక భూముల రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

అమరావతి, సెప్టెంబరు 11: కృష్ణానదికి వచ్చిన వరద ప్రభావంతో మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న లంక భూములలో పంటలు నష్టపోయిన రైతులకు తగు పరిహారం మంజూరు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ప్రధానంగా వైకుంఠపురం, అమరావతి గ్రామాల్లో సుమారు 200 మంది రైతుల పంట నష్టాన్ని అధికారులు నమోదు చేయటంలేదని, ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కారంపూడి, సెప్టెంబరు 11: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం సీపీఐ నేతలు కారంపూడిలో విరాళాల సేకరించారు. ఈ విరాళాలను బుధవారం పట్టణంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా, పట్టణ కార్యదర్శి సూరె హనుమంతురావు, మండల సహాయ కార్యదర్శి కూరాకుల వెంకట శివయ్య, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు ఏకే నాగమణి, శశిదేవి సీపీఐ నేతలు తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

గురజాలటౌన్, సెప్టెంబరు 11: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని డీడీఏ శివకుమారి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలనే లక్ష్యంతో 2005లో కేంద్రప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో ప్రవీణ్, ఏడీఏ జగదీశ్వరరెడ్డి, ఏవో సంధ్యా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రెంటచింతల: అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచడానికి ప్రభుత్వ పాలనా విధానాలు ప్రజలు సులువుగా అవగాహన చేసుకోవడానికి 2005 సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ డీడీ ఎం.శివకుమారి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కుచ చట్టంపై అటు రైతులకు ఇటు వ్యవసాయ సిబ్బందికి ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి ప్రధాని డాక్టర్ మన్‌మోహన్‌సిగ్ ఈ చట్టం వాడుకలోకి రావడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. రూ.10లతో చలానా కడితే మనకు కావాల్సిన శాఖల సమాచారాన్ని పత్రాల రూపంలో పొంది తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ సైంటిస్ట్ సైదానాయక్, ఏవో ప్రవీణ్, రాంబాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: సమాచార చట్టం ద్వారా ఎటువంటి సమాచారం తెలుసుకోవాలనే అంశంపై బుధవారం దాచేపల్లి మండల పరిషత్ మీటింగ్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దాచేపల్లి ఎంపిడిఓ శోభారాణి, వ్యవసాయ శాఖ ఎఓ పాపకుమారి ఆధ్వర్యంలో ఆర్‌టిఐ యాక్ట్ 2005 మీద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ఆర్‌టిఐ యాక్ట్ రిసీవ్ చేసుకున్నప్పుడు ఎటువంటి రిజిస్టర్ మెయిన్‌టైన్ చేయాలి, రిజిస్టర్ ఏవిధంగా రాయాలి, వారికి ఇన్‌ఫర్మేషన్ ఏ విధంగా అందించాలి అనే అంశాలపై వివరంగా శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం ఉద్యోగులు, మండల పరిషత్ ఉద్యోగులు తదితరులు హాజరయ్యారు.

పెదకూరపాడు : పెదకూరపాడులోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై డిప్యూటీ తహసీల్దార్ పీ నిర్మల కృష్ణ అవగాహన కల్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఇంజం శాంతి అధ్యక్షత వహించగా ఈ అవగాహన కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీలు



శావల్యాపురంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారి

శావల్యాపురం, సెప్టెంబరు 11: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, మందుల నాణ్యత, సిబ్బంది పనితీరు, పరిసరాల శుభ్రత, మౌలిక వసతులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర బృందం సభ్యులు బుధవారం శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా క్వాలిటీ విభాగం వైద్యాధికారి రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ శ్రీహరి, మాధవన్ కుట్టినాయర్, వీరచోళన్ పాల్గొని పీహెచ్‌సీలో తనిఖీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైద్యశాఖ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతున్నాయా, వైద్య పరికరాలన్నీ అందుబాటులో ఉన్నాయా, పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారా, రోగుల చికిత్సకు వినియోగించిన వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తున్నారా, రోగులకు ల్యాబ్ పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి కేంద్రానికి నివేదికను అందించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఓపీలు, సాధారణ కాన్పులు, ఆరోగ్య కార్యక్రమాల ధ్రువపత్రాలు, ప్రసూతి, సాధారణ పరిపాలన విభాగాల్లో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. జిల్లా క్వాలిటీ విభాగం వైద్యాధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు తనిఖీలు జరుగుతాయని, ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పీహెచ్‌సీ నిర్వహణ ఉన్నట్లయితే పీహెచ్‌సీ అభివృద్ధి నిమిత్తం కేంద్రప్రభుత్వం ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్ళపాటు మొత్తం రూ.9లక్షలు మంజూరు చేస్తుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు రాధాకృష్ణన్, రమ్య, స్టాఫ్‌నర్సులు లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డెయిరీ లక్ష్యం

● డైరెక్టర్ ఆంజనేయులు

పోట్లూరు(శావల్యాపురం), సెప్టెంబరు 11: పాల ఉత్పత్తిదారులకు వివిధ రకాల రాయితీలందిస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా సంగం డెయిరీ నిరంతరం కృషి చేస్తుందని వినుకొండ సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు అన్నారు. మండలంలోని పోట్లూరు ఎంపీడబ్ల్యూఎస్ సెంటర్లో బోనస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 2023-24 ఆర్థికసంవత్సరానికి సెంటర్లోని 125 మంది ఉత్పత్తిదారులకు రూ.6,68,653లను బోనస్‌లుగా పంపిణీ చేశారు. వీరిలో అత్యధికంగా నన్నూరి పేరయ్య రూ.36,361, చింతా వెంకట్రావు రూ.23,372, గోవిందయ్య రూ.23,049, నన్నూరి మోహన్‌రావు రూ.రూ.20,774, చింతా గోపాలరావు రూ.17,894లను బోనస్‌లుగా పొందారు. మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు మాట్లాడుతూ సంస్థకొచ్చే లాభాల్లో ఉత్పత్తిదారులను భాగస్వాములను చేస్తున్న సంస్థ సంగం డెయిరీ మాత్రమేనని, పోట్లూరులో రూ.100కు రూ.7.50 చొప్పున బోనస్‌లను అందించామన్నారు. పశువైద్యుడు శ్రీనివాసరావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ రామకోటయ్య, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, రామకృష్ణ, కిరణ్, ఏసుబాబు, హర్ష పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట సెప్టెంబరు11: గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా చిలక లూరిపేట టౌన్-2 పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. పండరీపురం, ఐటీసీ కంపెనీ, బ్యాంక్ కాలనీ, ఎన్ఆర్‌టీ సెంటర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని వివరించారు.

వరద బాధితులకు పట్టణ పొదుపు సంఘాల విరాళం



చెక్కును ఎమ్మెల్యే అరవిందబాబుకు అందజేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: పట్టణ పొదుపు సంఘాల మహిళలు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా రూ.1.20 లక్షలు అందజేశారు. చెక్కును బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు అందజేశారు, కార్యక్రమంలో నరసరావుపేట టూటౌన్ పొదుపు సంఘ అధ్యక్షురాలు షేక్ అఖిల, మహిళలు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సాయం



కార్యక్రమంలో ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపునకు గురైన విజయవాడ బాధితులకు ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సాయం అందించామని ప్రిన్సిపాల్ జీ నాగ మల్లేశ్వరరావు బుధవారం తెలిపారు. విజయవాడలోని రామకృష్ణాపురం, పరిసర ప్రాంతాలలోని 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, అంటువ్యాధులు వ్యాపించకుండా స్థానిక వైద్యుల సలహాల మేరకు మందులు ప్రత్యేక వాహనం ద్వారా తరలించి పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ. కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్ గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్రులు



శ్రీనివాసనగర్‌లోని వినాయక విగ్రహం వద్ద పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ, మక్కెన, చైర్మన్, కౌన్సిలర్

వినుకొండటౌన్, సెప్టెంబర్ 11: పట్టణంలోని ఆరోవార్డు నందు ఉన్న మహా గణపతి స్వామి వారి ఆలయ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ వార్డు నాయకులు గంధం కోటి బ్రదర్స్, దాతల సహకారంతో 19వ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, పేదలకు అన్నసంతర్పణ చేశారు. భక్తులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, బహుమతులు అందజేశారు. అదేవిధంగా బోస్‌బొమ్మ సెంటర్, రెడ్డినగర్, శ్రీనివాసనగర్, విష్ణుకుండీనగర్, ఓబయ్య కాలనీ, గీతామందీర్, హెడ్ పోస్టాఫీస్, విగ్రహాల వద్ద భక్తులు పెద్దసంఖ్యలో చేరి, స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పట్టణంలోని వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, జగనసేన నాయకులు నాగశ్రీను సందర్శించి విగ్రహ ఉత్సవ కమిటీలను అభినందించారు.

రొంపిచర్ల, సెప్టెంబరు 11: మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. రొంపిచర్లలోని రామాలయం వద్ద మంగళవారం రాత్రి మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. గ్రామస్థులు ప్రదర్శనను తిలకించేందుకు అధికసంఖ్యలో వచ్చారు. గణనాధుని విగ్రహాలు పూజలు అందుకుంటున్నాయి. ఎస్ఐ అశోక్ బందోబస్తు కార్యక్రమాలను నిర్వహించారు.

వాడవాడలా ఘనంగా వినాయక నిమజ్జనాలు



నరసరావుపేటలో గణేష్‌ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ఇక్కుర్రులో ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుడు



గురవాయపాలెంలో లడ్డును దక్కించుకున్న పూనాటి బ్రహ్మయ్య తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: పట్టణంలో రామిరెడ్డిపేటలోని భాష్యం స్కూల్ వద్ద గణేష్ విగ్రహం ఐదో రోజు బుధవారం నిమ్మనానికి తరలించారు. ఈ 14 వినాయక చవితి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేలంలో స్వామి వస్త్రాలు రావెళ్ల కొండయ్య రూ.5516లు, మహిళల లడ్డును రావెళ్ల వెంగమ్మ రూ.11116లు, పురు షుల లడ్డును అడుసు మల్లి వెంకటేశ్వర్లు రూ.22116లకు దక్కించుకున్నారు. రెండు వేల మందికి అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో నల్లపాటి హరికృష్ణ, ఇంద్రసేనా రెడ్డి, నూతి రామకృష్ణ, రావెళ్ళ రామకృష్ణ, రావెళ్ళ నరసింహారావు, బొప్పన శ్రీకాంత్, కట్టా వెంకటేశ్వర్లు, కట్టా సిద్దు, అడుసు మల్లి బలరామ్, నల్లపాటి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో కాలనీలో..

పట్టణంలో ఎన్‌జీవో కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం నిమ్మనానికి తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. కాగా లడ్డును వేలంలో రూ.71 వేలకు మురహరి శ్రీనివాసరావు దక్కించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, వాసిరెడ్డి రవి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.56 లక్షలు పలికిన గణేషుని లడ్డు

మండలంలోని గురవాయపాలెం వినాయకచవితి సందర్భంగా రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేషుని లడ్డుకు బుధవారం వేలం నిర్వహించారు. 25 కేజీల లడ్డును పూనాటి బ్రహ్మయ్య రూ.2 లక్షల 56 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో లడ్డూలకు వేలం

జొన్నలగడ్డలో వినాయక చవితి లడ్డూలకు బుధవారం వేలం నిర్వహించారు. 11కేజీల లడ్డూను నల్లపాటి అరవింద్, మహేష్‌లు రూ.45 వేలకు, 9 కేజీల లడ్డూను నల్లపాటి వేదాంషి రూ.45 వేలకు, మరో 9 కేజీల లడ్డూను ముద్దన యువాన్ రూ.85 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 11: మండలంలో ఏర్పాటుచేసిన గణనాథులను నిమజ్జనానికి తరలిస్తున్నారు. బుధవారం మండలంలోని లింగంగుంట్ల, ఇక్కుర్రు గ్రామాల్లో గణనాధులను మేళతాళాలు, తప్పెట్ల మోతలతో గ్రామాల ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించి నిమజ్జనాలకు తరలించారు. లింగంగుంట్లలో 25 కేజీల లడ్డును బాపతు కృష్ణ చైతన్యరెడ్డి స్వామివారి వద్ద ఏర్పాటు చేయగా బుధవారం నిర్వహించిన వేలం పాటలో టి.జయభరత్‌రెడ్డి రూ.1,40,వేలకు దక్కించుకున్నారు. దాలర్లను నంద్యాల విష్ణువర్దన్‌రెడ్డి ఏర్పాటు చేయగా ఎనుమూరి అజయ్ రూ.23,100 వేలం పాటలో దక్కించుకున్నారు. నిమజ్జనాల సంద ర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

శావల్యాపురం, సెప్టెంబరు 11: వినాయకచవితిని పురస్కరించుకొని మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు, వేల్పూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంటుపాలెంలో వినాయక విగ్రహం వద్ద స్వామివారి లడ్డు ప్రసాదానికి నిర్వహించిన వేలంపాటలో మంగమూరి నాగేశ్వరరావు, వీరలక్ష్మి దంపతులు గరిష్టంగా రూ.1,35,000లకు లడ్డును దక్కించుకున్నారు. వేల్పూరులోని ఎన్టీఆర్ సెంటర్లో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో మానుకొండ వెంకటేష్ రూ.1,05,000లకు లడ్డును దక్కించుకొన్నారు. వయకల్లులో వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలం పాటలో తూబాటి గోకుల్ రూ.25,500లకు దక్కించుకొన్నారు. అనంతరం విగ్రహాలను అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

రూ.41 వేలకు లడ్డును దక్కించుకున్న జీవీ దంపతులు



వేలం పాటలో లడ్డును దక్కించుకున్న ఎమ్మెల్యే జీవీ దంపతులు

వినుకొండటౌన్, సెప్టెంబరు 11: రాష్ట్రానికి సాధ్యమైనంత త్వరగా జగన్ రెడ్డి విఘ్నలు తొలగి అభివృద్ధిలో పరుగులు తీయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న ట్లు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ కొత్తపేటలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఎమ్మెల్యే జీవీ ఆంజ నేయులు ఆయన సతీమని లీలావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో పాల్గొని రూ.41 వేలకు లడ్డును కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మేళతాళాలతో లడ్డూను ఊరేగింపుగా ఆయన నివాసానికి తరలించారు.

సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం వంటిది

● వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మస్తానమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 11: ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవచ్చనని వ్యవసాయశాఖ ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వీఏఏలు, వీఆర్వోలకు పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం - 2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో ఏవో నరేంద్రబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్ల, సెప్టెంబరు 11: ప్రభుత్వశాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టం 2005 తీసుకురావటం జరిగిందని ఏవో షేక్ సుగుణా బేగం వివరించారు. స్థానిక నూజెండ్ల రైతు సేవాకేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో రైతులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో ఎలీషా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

శావల్యాపురం, సెప్టెంబరు 11: ఆర్టీఏ కమీషనర్ ఆదేశాల మేరకు స్థానిక రైతుసేవాకేంద్రంలో ఆర్టీయాక్ట్‌పై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి రామారావు మాట్లాడుతూ రైతులు ఎవరైనా వ్యవసాయశాఖకు సంబంధించిన సమాచారం అడిగితే సిబ్బంది వెంటనే స్పందించి వారికి నెలరోజులలోపు పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. ఏఈవో పాల్గొన్నారు.

ఈపూరు, సెప్టెంబరు 11: ఈపూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ సిబ్బందికి, రైతులకు సమాచారహక్కు చట్టంపై అవగాహన కల్పించారు. దీని ద్వారా అడిగే సమాచారాన్ని నెలరోజుల్లో ఇవ్వాల్సి ఉంటుందని మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు అన్నారు.

కావూరు, నాదెండ్లలలో..

చిలకలూరిపేట, సెప్టెంబరు 11: నియోజకవర్గంలోని కావూరు, నాదెండ్లలో అధికారులకు, ప్రజలకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో హరిప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద పత్రాలను, రికార్డులను తనిఖీ చేసే హక్కు, రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని ప్రింట్ అవుట్‌ల ద్వారా దాని పొందవచ్చునని అన్నారు.

పౌష్టికాహార లోపాలు అధిగమిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత



కారుమంచిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

కారుమంచి(శావల్యాపురం), సెప్టెంబరు 11: పౌష్టికాహార లోపాలను అధిగమించినపుడే ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారుమంచిలో పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. అనంతరం అంగనవాడీ కేంద్రంలో శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాలున్న ఆహారాన్ని తింటే రక్తహీనత దరిచేరకుండా ఉంటుదన్నారు. ఇన్‌చార్జి సర్పంచ్ మల్లాపరపు గాలెయ్య, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్ హేమలత, అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

రొంపిచర్లలో మాసోత్సవాలు

రొంపిచర్ల, సెప్టెంబరు 11: రొంపిచర్లలోని పడమటిపాలెంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాల గురించి అంగన్‌వాడీ వర్కర్లు వివరించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కంభంపాడులో..

నూజెండ్ల, సెప్టెంబరు 11: మండలంలోని కంభంపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తయారీ, వినియోగం తదితర విషయాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు.

ఫార్మసీ అధ్యాపకురాలికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ ప్రదానం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: స్థానిక ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా పని చేస్తున్న కే నర్సుకుమారికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రదానం చేసిందని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. రసాయన శాస్త్రంపై ఉన్నటు వంటి మక్కువతో ఔషధాలపై హెచ్‌పీఎల్‌సీ మెథడ్ డెవలప్మెంట్, వాలిడేషన్ అనే అంశంపై చేపట్టిన రీసెర్చ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డి ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా నర్సుకుమారిని కళాశాల ప్రిన్సిపాల్ భార్గవ్ భూషణ్‌రావు, డీన్ ఎం లక్ష్మీసురేఖ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు

నూజెండ్ల, సెప్టెంబరు 11: మండలంలోని ఐనవోలులో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారులను ఆక్రమించుకొని వ్యాపారం చేసుకుంటున్న దుకాణాలను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారటంతో ఆక్రమణలను తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

సీఐ, ఎస్ఐలకు మెమోలు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 11: ఇటీవల ఓ వైసీపీ నాయకుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్, వీఆర్‌లో ఉన్న ఎస్ఐ పట్టణ రబ్బానిలకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు బుధవారం మెమోలు జారీ చేసినట్లు సమాచారం. ఓ వైసీపీ నాయకుడి జన్మదిన వేడుకల్లో పై ఇద్దరు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. సదరు సీఐని ఆ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఓ వ్యక్తి మట్కా కేసులో పట్టుబడ్డ నిందితులను వదిలివేయమని అడిగాడు దానికి సదరు సీఐ నిరాకరించడంతో పది రోజులు క్రితం జరిగిన సదరు జన్మదిన వేడుకల ఫోటోను వైరల్ చేశాడు. సోషల్ మీడియాలో ఈ వీడియో హల్‌చల్ చేసింది. పలు దిన పత్రికల్లో కూడా వార్త వచ్చింది. దీంతో స్పందించిన ఎస్పీ ఇద్దరికి మెమోలు జారీ చేసినట్లు సమాచారం.

చికిత్స పొందుతున్న టీడీపీ నేత మృతి

నాదెండ్ల, సెప్టెంబరు 11 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న తూబాడుకి చెందిన టీడీపీ నేత వాసిమళ్ళ సంగీతరావు(73) మృతి చెందారు. ఆయన గత నెల 29వ తేదీన తన కుమారుడుతో కలసి మోటారు బైక్‌పై చిలకలూరిపేట వెళ్తుండగా సీఆర్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. వెనుక నుంచి వచ్చిన ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టడంతో సంగీతరావు తీవ్రంగా గాయపడ్డారు. ఆయన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు స్కూల్ గేమ్స్ నిర్వాహణకు కోఆర్డినేటర్ల సమావేశం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: పల్నాడు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 2024-2025 విద్యా సంవత్సరానికి స్కూల్ గేమ్స్ నిర్వాహణకు గురువారం ఉదయం 9 గంటలకు సమావేశం జరుగుతుందని డీఈవో ఎం వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలోని మండల కోఆర్డినేటర్లు, నియోజకవర్గ కో ఆర్డినేటర్‌లకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలలో గేమ్స్ ఎలా నిర్వహించాలో చర్చించాలని, అందరూ తప్పనిసరిగా రిపోర్టు చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును పునఃపరిశీలించాలి

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్



కలెక్టర్ పీ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 11: ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్‌పై సుప్రీం కోర్టు తీర్పును పునఃపరిశీలించాలని రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టర్ పీ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఉంటే బీజేపీ వారి కనుసన్న లలో అప్రజాస్వామికమైన తీర్పునిచ్చి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెబుతామ న్నారు. దేశంలో మెజారిటీ ప్రజలు ఎస్సీ వర్గీకరణ, కోర్టు తీర్పును వ్యతిరేకిస్తుంటే మనువాదాన్ని భూజాన పెట్టుకొని ఓటు బ్యాంకు రాజకీయాలు కోసం తీర్పును గౌరవిస్తున్న కొన్ని రాజకీయ పార్టీలకు త్వరలో బుద్ధి చెప్పే విధంగా మాలమహానాడు పోరాటాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గోదా బాల తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో శాప్‌పై విద్యార్థులకు అవగాహన

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 11: స్థానిక నరసరావుపేట ఇంజ నీరింగ్ కళాశాలలో బుధవారం శాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వ హించినట్లు కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐబీఎం కంపెనీ ఎస్ఏపీ డెలివరి మేనేజరు కె.రమణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎస్ఏపీలో విభిన్నమైన విభాగా లు అయిన ఫైనాన్సు హెల్త్‌కేర్, మ్యాను ఫాక్చరింగ్, పరిశ్రమల్లో విస్తృత మైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్‌లు మిట్టపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో లీలావతి పుట్టినరోజు వేడుకలు

ఈపూరు, సెప్టెంబరు 11: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తీ లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి పుట్టిన రోజు వేడుకలను ఈపూరు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ఘనంగా జరుపుకున్నట్లు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావర్ల జగ్గారా వు తెలిపారు. వసతి గృహాల పిల్లల సమక్షంలో లీలావతి భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా 3 వందల మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మం డల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, వెంకటకోటయ్య, హనుమయ్య, కోటేశ్వరరావు, బి.సైదులు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధిత బాలలకు స్కాలర్‌షిప్

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 11: హెచ్ఐవి సోకిన బాలలకు 18 సంవత్సరాల లోపు తల్లి తండ్రి లేని బాలలు తల్లి లేదా తండ్రి లేని బాలుడు హెచ్ఐవీ ప్రభావిత పిల్లలు తల్లి తండ్రి ఉండి పిల్లల్ని పెంచ డానికి ఆర్థిక స్తోమత లేని వారికి నెలకు 4000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ మంజూరు చేసినట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు 2023, 24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా పరిధిలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి గుర్తించిన అరు లైన 408 బాలలకు నెలకు నాలుగు వేల చొప్పున ఆరు నెలలకు ఒక్కొక్కరికి 24,000 మొత్తం 97 లక్షల 92,000 మేరకు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినట్లు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించాలి

● గోల్కొండ సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి



రామిరెడ్డిని సత్కరించిన ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

నాదెండ్ల, సెప్టెంబరు 11: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని గోల్కొండ సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని సాతులూరులో నిర్మిస్తున్న రెడ్డిపేరంటాలమ్మ ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఆశీస్సులతో ఆలయాన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించాలన్నారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా సహకరించినప్పుడే దేవాలయాలు రూపు దిద్దుకుంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయన దేవాలయ కమిటీ సభ్యులను, గ్రామస్థులను అభినందించారు. రెడ్డిపేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గతంలోనే ఆయన దేవాలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. కాగా చిరుమామిళ్ళ గ్రామంలోని యానాది కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక చవితి నిర్వాహకులకు రూ.18వేల విరాళాన్ని అందించారు.

వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతగా పనిచేయాలి

● ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, సెప్టెంబరు 11: గ్రామాల్లో నూతనంగా విధుల్లోకి చేరిన వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ, వెలుగు సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.